క్లుప్తంగా

కాల భైరవాష్టమి పూజలు



కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని ఎంఎస్ కొట్టాల గ్రామంలో ఆదివారం శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో కాలభైరవాష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీధర్‌శర్మ తొలుత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. ఆలయం వెలుపల భక్తులు ప్రత్యేక పూజలను సామూహికంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రత్యేక పూజలలో భాగంగా కుష్మాండ దీపాలతో స్వామికి భక్తులు హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీరావు, కార్తీక్‌రెడ్డి తదితరులు పూజలను పర్యవేక్షించారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేయడం తగదు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లను నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని కడప, పొద్దుటూరు, రాయచోటి, రైల్వేకోడూరులతో పాటు పలు ప్రాంతాల్లో పాఠశాలలు ప్రారంభంకాకముందే 60 శాతం అడ్మిషన్లు పూర్తి చేసుకున్నారన్నారు. జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల వివరాలను విద్యాశాఖ బహిర్గతం చేయాలన్నారు.

రక్తదానంలో యువత ముందుండాలి

కడప ఎడ్యుకేషన్: రక్తదానంలో యువత ముందుండాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. జూన్ 14వ తేదీన ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన ప్రచార పోస్టర్స్‌ను ఆదివారం ఆయన కార్యాలయంలో విడుదల చేశారు. రక్తదానం చేస్తే ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు అబ్దుల్ రాయ ల్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. పులివెందుల కేఎస్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధుల ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కొత్తవారి పట్ల జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్

కడప కల్చరల్: ఆలయాలలో పూజలు చేసేందుకు గ్రామాలలో పౌరోహిత్యం నిర్వహించేందుకు వచ్చే కొత్తవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మోచంపేటలోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొందరు అర్చకులు నేరాలకు పాల్పడినట్లు ప్రసార మాధ్యమాల్లో వస్తోందని, అలాంటి వారి పట్ల అర్చక వృత్తికి కళంకం తెస్తోందన్నారు. ఆలయాలలో అర్చకత్వానికి కొత్త వ్యక్తులను తీసుకునేటపుడు వారి చరిత్రను సంపూర్ణంగా తెలుసుకున్న తర్వాతే అవకాశం ఇవ్వాలన్నారు. పౌరోహిత్యం చేయించుకోదలిచిన వారు కూడా పురోహితుని ఎంపికలో జాగ్రత్తలు వహించాలని, అవసరమైతే స్థానిక అర్చక పురోహిత సంఘాల ప్రతినిధుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకు వెళ్లాలన్నారు. కొత్తవారిని పూజలకు అనుమతించే ముందు దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక అర్చకులు సిద్దవటం రవి వీరప్రసాద్, ప్రసాద్‌శర్మ, రాఘవేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రకు ప్రభుత్వ సాయం మరువలేం



ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాతో ముస్లిం మతపెద్దలు, పీఠాధిపతులు

కడప కార్పొరేషన్: ఈ ఏడాది హజ్‌యాత్రను సఫలీకృతం చేయడంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఎంతో కృషి చేశారని వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మున్నా అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎంను మతపెద్దలు, పీఠాధిపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి విమానయాన చార్జీలు ఒక్కొక్క హజ్ యాత్రికునిపై రూ.80 వేలు అదనంగా పడుతుండటంపై స్పందించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాత సాంకేతిక కారణాల వల్ల వారు ఏం చేయలేమని చేతులెత్తేయడంతో అదనంగా అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందన్నారు. సుమారు రూ.14.50కోట్లు రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు సాయం చేసిందన్నారు. దేశం మొత్తం మీద అన్ని రాష్ట్రాల్లో ఇలాగే ఎక్కువ చార్జీలు ఉన్నప్పటికీ ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇలా సాయం చేయలేదని తెలిపారు. పేద ముస్లిం మైనార్టీల పట్ల వైఎస్ జగన్ చూపుతున్న ఆదరణ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వలీవుల్లా హుస్సేనీ, కార్పొరేటర్ షఫీ, ఉమైర్, అలీ అక్బర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం చరిత్రాత్మకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న మేయర్ సురేష్ బాబు

– కడప మేయర్ కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలోని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడం చరిత్రాత్మకమని కడప మేయర్ సురేష్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో వైద్య, ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 ఏళ్లుగా కాంట్రాక్టు వ్యవస్థలో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని నిర్ణయించడం సంతోషదాయకమన్నారు. ఉద్యోగుల కుటుంబాలు జీవితాంతం ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాయన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు.

ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ (వైఎస్సార్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివానాయక్, కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ నాయకుడు షాజహాన్, వెంకటసుబ్బయ్య, వెంకట్‌రెడ్డి, మేసా జాన్సన్, వలీబాషా, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఔన్నత్యం తెలిపే 'చిత్ర కవితా సౌరభం'



పుస్తకావిష్కరణలో సాహితీవేత్తలు

కడప కల్చరల్ : అలంకారం వెంకట రమణరాజు రచించిన చిత్ర కవితా సౌరభం గ్రంథం తెలుగు భాష ఔన్నత్యాన్ని మరింత స్పష్టం చేస్తుందని హైదరాబాదుకు చెందిన సాహిత్యవేత్త చింత రామకృష్ణారావు అన్నారు. ఆదివారం కడప నగరం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో చిత్ర సాహితీ ప్రచురణలు ఆధ్వర్యంలో వెంకట రమణరాజు రచించిన చిత్ర కవితా సౌరభం గ్రంథ ఆవిష్కరణసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఇతర అతిథులతో కలిసి చిత్రకవితా సౌరభం గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రకవిత్వ రంగంలో ఈ గ్రంథం గొప్ప ప్రయోగమని, ఇదివరకు వచ్చిన ఇలాంటి గ్రంథాల కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా మొత్తం 11 భాగాలుగా వెలువడనుండడం అపూర్వమన్నారు. సభాధ్యక్షులు, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి , ప్రత్యేక అతిథులు ఏలూరుకు చెందిన కందుల నాగేంద్ర వరప్రసాద్, డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ చిత్ర కవితా సౌరభం గ్రంథం విశిష్టతను తెలిపారు.

సమీక్షలు : చిత్రకవితా సౌరభం గ్రంథాన్ని ఈ కార్యక్రమంలో ముగ్గురు సాహితీవేత్తలు సమీక్షించారు. తొలుత వైవీయూ లలిత కళల విభాగ అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి , తర్వాత సాహితీవేత్త అవధాని ఎంవీఎల్ ప్రసాద్ (శారద ప్రసన్న) సమీక్షించారు. సాహితీవేత్త అవధానం అమృతవల్లి ఆంగ్లంలో సమీక్షించడం విశేషం. గ్రంథ రచయిత వెంకట రమణరాజు మాట్లాడుతూ తన రచన నేపథ్యాన్ని వివరించారు. అనంతరం యువ సాహితీవేత్త డాక్టర్ జీవీ సాయిప్రసాద్ సభను పర్యవేక్షించగా, నిర్వాహకులు అలంకారం విజయ్‌కుమార్, ఆదిత్యకుమార్‌లు అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సింహాద్రిపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులతోపాటు మంచి ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల మెంటర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన సింహాద్రిపురంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రైతులు రసాయనిక ఎరువులు వాడటంవల్ల భూమి గుల్లబడి దిగుబడులు రాక పెట్టుబడులు అధికంగా పెట్టి నష్టపోతుంటారని.. అందుకు ప్రభుత్వం రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తే భూమిలో పోషకాలు పెరిగి వానపాములు సమృద్ధిగా ఉంటాయన్నారు. రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం, దిగుబడి బాగా ఉంటుందన్నారు. అనంతరం 50 సెంట్లలో 10 రకాల కూరగాయలను పండించడానికి అవసరమైన ఘన జీవామృతాన్ని తయారు చేయించారు. కార్యక్రమంలో రైతు రాజశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కొరముట్ల

– ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : మండలంలోని మాధవరంపోడులో ఆదివారం అంకాలమ్మ తల్లి జాతర సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ రామరాజు ఇంటిలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, మాజీ సర్పంచ్ రామరాజు, మునిచందర్‌రాజు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, శివయ్య, తోట శివసాయి తదితరులు పాల్గొన్నారు.

శబ్దకాలుష్య వాహనాలపై స్పెషల్‌డ్రైవ్



సైలెన్సర్‌లేని వాహనాలను సీజ్ చేసి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కడప అర్బన్: నగరంలో శబ్దకాలుష్యం చేస్తున్న బుల్లెట్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలపై కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్‌ను ఆదివారం కడప ట్రాఫిక్ పోలీసులు చేపట్టారు. ఎస్‌ఐ వెంకటయ్య తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టి శబ్ద కాలుష్యం కలుగజేసే సదరు వాహనాలకు జరిమానాలు విధించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ చేసి వారి వాహనాలను అప్పగించారు. సైలెన్సర్‌లు అమర్చుకోకపోతే చట్టపరమైన చర్యలను తీసుకుంటామన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ప్రతిభా పురస్కారాలు అందుకున్న తొగటవీర క్షత్రియ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మున్సిపల్ డీఈ గంజికుంట వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం తొగటవీరక్షత్రియ విద్యార్థులకు 11వ వార్షిక ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను వారికి ఇష్టం వచ్చిన దానిలో ప్రోత్సహిస్తే రాణిస్తారన్నారు. తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభ గల తొగట పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 11 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలను శ్రీచౌడేశ్వరి తొగటవీర క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అందచేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన పదవ తరగతి విద్యార్థులకు, స్థానికంగా ఇంటర్ చదివి మంచి మార్కులు సాధించిన అన్ని గ్రూపుల విద్యార్థులకు, డిగ్రీ, బీటెక్, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందచేశారు. అలాగే ఎంబీబీఎస్ చదువుతున్న జి.శ్రీలీల అనే విద్యార్థినికి రూ.50వేలను కళాశాల, హాస్టల్ ఫీజుకోసం అందచేశారు. మొత్తం 68 మంది విద్యార్థులకు రూ.2.10లక్షల నగదు పురస్కారాలుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళ్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, గౌరవాధ్యక్షుడు పట్టుపోగుల పుల్లయ్య, జనరల్ సెక్రటరీ పల్లా శేషయ్య, తొగట వీరక్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు ఉమ్మడిశెట్టి చౌడయ్య, చౌడం వెంకటరమణ, గంజికుంట ఆంజనేయులు, లక్ష్మినారాయణ, రామయ్య, సుబ్బరాయుడు, శివాలయం మాజీ చైర్మన్ పల్లా శంకర్‌నారాయణ, రమణ, నాగమయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగులో ప్రతిభకు ప్రోత్సాహం

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడిపాడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తెలుగు సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఆ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు బి.శివారెడ్డి సొంత నిధులతో ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున హెచ్ఎం ప్రేమకుమారి చేతుల మీదుగా ఆదివారం నగదు బహుమతి అందజేశాడు. ఈ ఏడాది జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఎర్రగుడిపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్.నిఖితకు తెలుగు సబ్జెక్టులో అత్యధికంగా 97 మార్కులు, అలాగే ఎస్.లక్ష్మీ మమతకు 96 మార్కులు వచ్చాయి.

ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కమలాపురం: కమలాపురం–మైదుకూరు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించిన ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి లకు కమలాపురం మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల కమలాపురంలో నూతన ఆర్టీసీ బస్టాండు నిర్మాణ పనుల భూమి పూజకు వచ్చిన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యేలను కమలాపురం–మైదుకూరు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఇతర నాయకులు, గ్రామ ప్రజలతో కలసి ఎస్‌సీ పుల్లారెడ్డి వినతి పత్రం అందించారు. కాగా గత రెండు రోజుల క్రితం ఈ బస్సు సర్వీసును పునరుద్ధరించారు. దీంతో ఆయన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ప్రజలు ఆటోల్లో ప్రయాణించి ప్రమాద బారిన పడకుండా సురక్షిత గమ్యాన్ని చేరుకోవడానికి ఆర్టీసి సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. అలాగే మరో సర్వీసును కూడా ఏర్పాటు చేయాలని ఆయన ఆర్టీసీ అధికారులను కోరారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సినీనటి కీర్తినాయుడు పేర్కొన్నారు. స్థానిక బుశెట్టి కళ్యాణ మండపంలో ఆదివారం ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సీవీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువు కోవాలన్నారు. ప్రతిభగల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. సీవీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధ్యక్షుడు సీవీ సుబ్బారావు మాట్లాడుతూ బాగా చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామన్నారు. సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ 2014 నుంచి ప్రతిభా పురస్కారాలను అందించడానికి సహకరిస్తున్న తన మిత్రుడు సీవీ సుమన్‌కు ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని 19 ఉన్నత పాఠశాలలకు చెందిన 45 మంది విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500 అందచేశారు. కార్యక్రమంలో సీవీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు సీవీ సురేంద్రబాబు, సీవీ సుమన్, డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బీసీల డిమాండ్లను పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : బీసీల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.సి.రమణ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక మహాత్మజ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బీసీ డిమాండ్ల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారు తప్ప బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో పాలకులు చొరవ చూపడంలేదన్నారు. కార్యక్రమంలో పూలే ఆశయసాధన కమిటీ చైర్మన్ బి.గురుమూర్తి, యాదవ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.చంద్రశేకర్, సంఘమిత్ర పెంచలయ్య, పార్స్ అధ్యక్షులు పిచ్చయ్య, మాజీ సర్పంచ్ రమణయ్య, ఆర్టీసీ యూనియన్ నాయకులు, మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



ప్రొద్దుటూరు: బహుమతులు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి



వల్లూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారిణి

వల్లూరు : స్థానిక గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంపు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థినీ విద్యార్థులకు దేశ భక్తి గేయాలు, చిత్రలేఖనం, డ్యాన్స్, చదరంగం మొదలైన అంశాలలో పోటీలను నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ కన్సోలేషన్ బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం : స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. గ్రంథాలయాధికారిణి ఎస్.నాగాంజలి ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశ భక్తి గేయాలు, చిత్ర లేఖనం, డ్యాన్స్, చదరంగం, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ రిటైర్డ్ అధికారి నరసింహులు చేతుల మీదుగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతి విద్యార్థికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలను నిర్వహించారు. ముందుగా గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం, రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి బహుమతులు అందించారు. వేసవి శిక్షణ శిబిరంలో బోధించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఆర్టీపీపీ డీఈ ప్రభాకర్‌రెడ్డి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్‌కాలేజి ప్రిన్సిపాల్ త్రివిక్రమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, రచయితలు డీకే చదువుల బాబు, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, రిటైర్డు హిందీ పండిట్ బికారి సాహెబ్, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : వాటర్‌షెడ్ ద్వారా రైతులకు సోమవారం ఉదయం 10 గంటలకు రాయితీతో పైపులు అందజేయనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గంగిరెడ్డిపల్లె గ్రామం వద్ద జగనన్న కాలనీకి భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కారకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పైడికాలువలో నాకాబందీ



వల్లూరు మండలం పైడికాలువలో తనిఖీ చేస్తున్న పోలీసులు

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామంలో ఆదివారం ఉదయం పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఎస్‌ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో గ్రామంలో విస్తృతంగా తనిఖీలను నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు తెలపాలన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

వీరపునాయునిపల్లె : గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఆదివారం పాయసంపల్లెలో ఆయన నాకా బందీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇరు పార్టీలకు చెందిన నాయకుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి గొడవలకు పాల్పడవద్దని ఏ వైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బోగాదమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న బోగాదమ్మ

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని అనిమెల గ్రామ సమీపంలో కోరుకొండపై వెలసిన బోగాదమ్మతల్లికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సచివాలయం పరిధిలోని వెల్లటూరు, వెల్లటూరు దళితవాడ, శవాస్కన్‌పల్లె, రెడ్డిపల్లె, గోపులాపురం గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల : కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కంపచెట్లలో మంగతాయి గ్యాంబ్లింగ్, జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5110 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సంజీవరెడ్డి ఆదివారం తెలిపారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే గ్రంథం భగవద్గీత



భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

బద్వేలు అర్బన్ : భగవద్గీత పఠనం ద్వారా ప్రతిఒక్కరిలో వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవచ్చని త్రైతసిద్ధాంత హిందూ జ్ఞానవేదిక – ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. త్రైతసిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అబ్బుసాహెబ్‌పేట, బోయినపల్లె, ఉప్పత్తివారిపల్లె, గొడుగునూరు, పుట్టాయపల్లె గ్రామాల్లో పలువురికి భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను పఠించడంతో పాటు అందులోని బోధనలను పాటించడం ద్వారా సుఖశాంతులతో పాటు సంస్కారం పొందవచ్చన్నారు. ముఖ్యంగా నేటితరం విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి భగవద్గీత పఠనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత హిందూ జ్ఞానవేదిక సభ్యులు వెంకటేశ్వర్లు, సుధాకర్, వెంకటక్రిష్ణ, పెంచలరత్నం, రమ్యశ్రీ, గాయత్రి, హరిప్రియ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.